పకడ్బందీగా 'పది' పరీక్షలు

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు
- ఏప్రిల్ 3 నుంచి పది పరీక్షలు ప్రారంభం

పాణ్యం: వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షలకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలు 13, ప్రైవేట్ స్కూళ్లు 3 ఉన్నాయి. ఈ ఏడాది ఆయా స్కూళ్ల నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 950 మంది రెగ్యులర్, 65 మంది సప్లమెంటరీ విద్యార్థులు(గతేడాది ఫెయిల్ అయిన వారు) కలిపి మొత్తం 1,015 మంది హాజరు కానున్నారు. వీరిలో 548 మంది బాలురు, 467మంది బాలికలు ఉన్నారు. పరీక్షల కోసం మండలంలో 4 కేంద్రాలను అధికారులు ఎంపిక చేశారు. ఒక్కో కేంద్రంలో చీఫ్ డిపార్ట్‌మెంటల్ అధికారితో పాటు 50 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో పాల్గొంటారు. పరీక్షా కేంద్రాల్లో మంచినీరు, విద్యుత్, టిబుల్స్, విద్యార్థుల కోసం ఒక హెల్త్ వర్కర్ అందుబాటులో ఉంచారు.



పాణ్యం మండలం నెరవాడ మెట్ట వద్ద ఉన్న బీసీ బాలికల పాఠశాల

పరీక్ష కేంద్రాలివే...

పది పరీక్షల కోసం అధికారులు నాలుగు కేంద్రాలను కేటాయించారు. పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 300 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అదేవిధంగా నెరవాడ మెట్ట ఎస్టీ బాలికల పాఠశాలలో 225 మంది, నెరవాడ మెట్ట బీసీ బాలికల రెసిడెన్సియల్ పాఠశాలలో 250 మంది, బలపనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 240 మందిని కేటాయించారు. మండలంలో మొత్తం 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మద్దూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 31 మంది విద్యార్థులు, గోరుకల్లు పాఠశాల నుంచి 19, కొండజుటూరు పాఠశాల నుంచి 9 మంది నంద్యాల మండంలో పరీక్షలు రాయనున్నారు.

అరగంట ముందే కేంద్రం వద్దకు :

పది పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరుగనున్నాయి. పరీక్షలు రాసే విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. పరీక్షకు ఒక నిమిషం ఆలస్యమైన కేంద్రంలోకి అనుమతించరు. ప్రభుత్వం నిర్ణయించిన సమయం మేరకు ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థుల వెంట హాల్‌టికెట్లతోపాటు పరీక్ష సామగ్రి పెన్ను, పెన్సిల్ లాంటి వస్తువులను అనుతిస్తారు.

పకడ్బందీగా అమలు



వచ్చే నెల 3వ తేదీ నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షా కేంద్రల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం . వైద్య సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి వచ్చి వారికి కేటాయించిన గదులను చూసుకోవాలి. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. **– ఎంఈఓ కోటయ్య**

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధి తడకనపల్లె గ్రామంలో విద్యుదాఘాతంతో బి.రాజశేఖర్(21) మృతి చెందాడు. ఎస్ఐ నల్లప్ప తెలిపిన వివరాలు... నంద్యాల జిల్లా డోన్ మండలం వెంకటనాయునిపల్లె గ్రామానికి చెందిన బెల్దార్ బి.రాజశేఖర్ తడకనపల్లెలో బంధువుల ఇంటి నిర్మాణ పనికి వచ్చాడు. మంగళవారం ఉదయం ఇంటి నిర్మాణ పనుల్లో నిమగ్నమై ఉండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలింది. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నల్లప్ప తెలిపారు.

నేడు ఆధార్ మొబైల్ క్యాంపులు

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి, కోడుమూర-3 గ్రామ సచివాలయాల్లో బుధవారం ఆధార్ మొబైల్ క్యాంపులను ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఈ కేంద్రాల్లో 5 సంవత్సరాలలోపు పిల్లలందరికి తప్పనిసరిగా ఆధార్ నమోదు చేయించుకోవాలని, ఆధార్ కార్డుల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే సరిచేయించుకోవచ్చని సూచించారు.

క్లుప్తంగా

వడదెబ్బపై అప్రమత్తం చేయండి



బలపనూరు ఆరోగ్య ఉప కేంద్రంలో తనిఖీ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ

పాణ్యం: ప్రస్తుత వేసవిలో ఎండలు తీవ్రమవుతున్నందున ప్రజలు వడదెబ్బ బారీన పడకుండా అప్రమత్తం చేయాలని నంద్యాల జిల్లా డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ అన్నారు. మంగళవారం బలపనూరు ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఆరోగ్య ఉప కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మందులు నిల్వ ఉంచుకోవాలన్నారు. కూలీ పనులకు వెళ్లే వారికి ఎండల ప్రభావం గురించి తెలియజేసి నీటిని బాగా తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు జరగాలని, ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకునేలా అందరూ కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ వేలాలు

గూడూరు: వాయిదా పడ్డ నగర పంచాయతీ వేలాలు ఈ నెల 29వ తేదీ(నేడు) నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారపు సంత, గొర్రెల మాంసం, గొర్రెల కమేళా, పెద్ద పశువుల మాంసం మార్కెట్, పెద్ద పశువుల కమేళాకు వేలాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మొదలైన గుండ్రేవుల బడేసావ్ ఉరుసు

సి.బెళగల్: మండల పరిధిలోని గుండ్రేవులలో బడేసావ్ తాత (శ్రీ బడేసావ్ ఖాద్రీ) ఉరుసు ఉత్సవాలు మొదలయ్యాయి. మంగళవారం రాత్రి గంధం కార్యక్రమం నిర్వహించేందుకు గ్రామ పెద్దలు దర్గాను అందంగా ముస్తాబు చేశారు. ఉరుసు ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ మాధవిని, పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ రాముడు ఆదేశించారు. ఉత్సవాల్లో భాగంగా గ్రంధం తర్వాత ఉరుసు, కిస్తీ కార్యక్రమాలు జరుగనున్నాయి. గ్రామ సర్పంచ్ ప్రజలకు ట్యాంకర్ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించారు. గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. పనులను గ్రామ పంచాయతీ కార్యదర్శులు మేరి, రాజశేఖర్ పర్యవేక్షించారు.

అధిక దిగుబడులు సాధించాలి



ఇనగండ్లలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

సి.బెళగల్: పంటల సాగులో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి కర్నూలు ఏడీఏ సాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఏఓ మల్లేష్‌కుమార్ మండల పరిధిలోని ఇనగండ్ల గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏడీఏ, డీఆర్సీ ఏడీఏ వెంకటేశ్వర్లు హాజరై రైతులకు వ్యవసాయంలో మెలకువలను తెలియజేశారు. వేరుశనగ పంట రక్షణ, తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడులు సాధించే విధానాలు, మిత్ర పురుగుల పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇమ్మానియేల్, గుండ్రేవుల గ్రామ పెద్ద శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు వరం

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ప్రజలకు వరం అని జిల్లా వ్యాధి నిరోధోక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏ.గోకులపాడు గ్రామంలో ప్రజలకు అందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ 104 వాహనం ద్వారా ప్రతి గ్రామంలో నెలకు రెండుసార్లు వైద్యులు పర్యటిస్తారన్నారు. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తదితరుల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శైలేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు స్థలాల్లో ఆక్రమణలు తొలగించండి

కల్లూరు: కర్నూలు నగరం నాలుగవ తరగతి కాలనీలోని పార్కు స్థలాలలో ఆక్రమణలు తొలగించి, ఫ్యామిలీ పార్కును ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని కోరారు. మంగళవారం ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో కలసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాలుగవ తరగతి హౌస్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): కోడుమూరు నియోజకవర్గంలోని జగనన్న కాలనీలతో పాటు వ్యక్తిగత ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే నివాసంలో కోడుమూరు నియోజకవర్గంలోని హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో లబ్ధిదారులందరూ గృహ నిర్మాణాలు చేపట్టే విధంగా అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణాలు వేగవంతం చేసేందుకు అధికారులందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గంలో ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, ఇంకా ఎంతమంది ఇళ్లు కట్టుకునేందుకు ముందుకు వస్తున్నారన్న వివరాలను అందజేయాలన్నారు. లేఅవుట్లలో ప్రభుత్వం అన్ని వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉందన్నారు. అర్హత ఉండి ఇళ్లు రానివారికి మంజూరు చేయిస్తానని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ డీఈ వాసుదేవరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలను బలోపేతం చేసుకోవాలి

కోడుమూరు రూరల్: గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని డీఆర్‌పీలు పద్మావతి, వెంకటేశ్వర్లు, రఫీ సూచించారు. మంగళవారం లద్దగిరి గ్రామ పంచాయతీ లోకల్ ట్రైనింగ్ సెంటర్‌లో కర్నూలు మండలంలోని గార్గేయపురం, పసుపుల, ఓర్వకల్లు మండలంలోని పూడిచెర్ల గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఇంజినీరింగ్, అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ అసిస్టెంట్లతో పాటు, క్లాప్ మిత్రాలు, షెడ్డు వాచ్‌మెన్‌లకు పంచాయతీల నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తడి, పొడి చెత్త వేరుచేయడం, చెత్త నుంచి వర్మీకంపోస్టు తయారీ వంటి వాటిపై డీఆర్‌పీలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కర్నూలు ఈఓఆర్డీ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లద్దగిరిలో చెత్త సేకరణపై శిక్షణ ఇస్తున్న డీఆర్‌పీలు

సంక్షేమ పథకాల్లో మహిళలకు సముచితస్థానం

- 872 సంఘాలకు రూ.5.29 కోట్లు నిధులు మంజూరు
- ఆసరా ఉత్సవాల్లో కలెక్టర్ కోటేశ్వరరావు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ఆసరా ఉత్సవాల్లో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని, చిత్రంలో కలెక్టర్ కోటేశ్వరరావు

ఓర్వకల్లు: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడంలో మహిళలకు సముచ్చితస్థానం కల్పించిందని కలెక్టర్ కోటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన ఓర్వకల్లులో ఎంపీడీఓ శివనాగప్రసాద్ అధ్యక్షతన మంగళవారం వైఎస్సార్ ఆసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ.425 కోట్ల నిధులను ఖర్చు చేసినట్లు తెలిపారు. రాజకీయప్రమేయం లేకుండా నేరుగా మహిళల ఖాతాల్లోనే నగదు జమ చేయడం అవినీతి నిర్మూలనకు నిదర్శనమన్నారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో 46 వేల మందికి గృహాలు మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హత కల్గి ఉండి ఇళ్ల పట్టాలు రానివారు ఉంటే పట్టాలు మంజూరు చేస్తామన్నారు. పొదుపు సంఘాల ద్వారా ఓర్వకల్లు మహిళలు సాధించిన పురోగతి అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు పొదుపు సంఘాల మహిళలకు వరుసగా మూడో సారి వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేయడం హర్షణీయమన్నారు. మండలంలో మొత్తం 872 సంఘాలకు మూడో విడత కింద రూ.5.29 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం పొదుపు రుణాలను మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలను మోసం చేసిందని విమర్శించారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలన్ని మహిళల పేరు మీదనే మంజూరు చేయడమేగాక, వారి ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. ఓర్వకల్లు పొదుపు మహిళలు అంతర్జాతీయస్థాయిలో రాణించడం గర్వంగా ఉందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు, పక్కాగృహాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును కలెక్టర్, ఎమ్మెల్యే మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటరామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు చంద్రశేఖర్‌రెడ్డి, నాగతిరుపాలు, సచివాలయ మండల కన్వీనర్ లోటర్ బాష, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, తైరున్నిషాభి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మహిళలు

నేడు గడివేముల, గుడిపాడులో ఆసరా చెక్కుల పంపిణీ..

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలోని రాజరాజేశ్వరీ పాఠశాల సమావేశ మందిరంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఏపీఎం హజరత్ తెలిపారు. ఇందులోభాగంగా ముఖ్య అతిథిగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. మండలంలో 597 పొదుపు గ్రూపులకు రూ.2.21 కోట్లు ఆసరా నిధులు మంజూరైనట్లు చెప్పారు. మండలంలోని పొదుపు మహిళలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆసరా ఉత్సవాలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గూడూరు రూరల్: మండలంలోని గుడిపాడులో ఎమ్మెల్యే సుధాకర్ చేతుల మీదుగా పొదుపు సంఘాల మహిళలకు బుధవారం వైఎస్సార్ ఆసరా చెక్కులను అందించనున్నట్లు ఎంపీడీఓ మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆసరా కార్యక్రమం ప్రారంభం అవుతుందని, మహిళలు హాజరుకావాలని కోరారు.

మహిళాభ్యున్నతికి సీఎం కృషి





మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ , ఆసరా ఉత్సవాలకు హాజరైన జనం

- మేయర్ రామయ్య, ఎమ్మెల్యే కాటసాని
- శరీన్‌నగర్‌లో ఆసరా సంబరాలు

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళాభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తున్నారని కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, నగర్ మేయర్ బీవై రామయ్య, నంద్యాల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్ పార్కులో ఆసరా సంబరాలు నిర్వహించారు. 19, 20, 21, 26, 29, 30, 31వ వార్డులలోని మొత్తం 657 పొదుపు సంఘాల మహిళలకు రూ.4.42 కోట్ల రుణాలను మాఫీ చేశారు. మేయర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ పొందిన రుణాలతో మహిళలు మెరుగైన జీవనోపాధులను కల్పించుకోవాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రజా సంకల్ప పాదయాత్రలో పొదుపు మహిళలకు 2019 ఏప్రిల్ 11 నాటికి ఉన్న రుణాలన్ని మాఫీ చేస్తానన్ని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట మేరకు ఇప్పటికే మూడో విడత ఆసరా పథకం అమలు చేస్తున్నారని చెప్పారు. అమ్మఒడి, ఆసరా, సున్నావడ్డీ, వసతి దీవెన, విద్యా దీవెన, విద్యాకానుక మొదలగు పథకాలతో ఎంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కేవలం జన్మభూమి కమిటీ సిఫారసులు చేసిన వారికే అందేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు పార్టీలు, కులమతాలు, రాజకీయాలకు, వర్గాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామన్నారు. గత టీడీపీ పాలన, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఉన్న తేడాను ప్రజలు గమనించాలన్నారు. అనంతరం మహిళలకు చెక్కును పంపిణీ చేశారు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, పలువురు కార్పొరేటర్లు, మెప్మా పీడీ నాగ శివలీల, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

గూడూరు: స్థానికి వైకేపీ కార్యాలయ ఆవరణలో మంగళవారం వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు నిర్వహించారు. మూడవ విడత కింద పట్టణంలో 372 పొదుపు గ్రూపులకు రూ.2 కోట్ల 25 లక్షలు ప్రభుత్వం జమ చేసింది. ఈ సందర్భంగా మెప్మా సీఎంఓ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, వైఎస్సార్సీపీ పట్టణ కన్వీనర్ జె.ఆబేలు హాజరయ్యారు. ముందుగా మహిళల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ అక్కచెల్లెమ్మలకు బాసట ఆసరా పథకం అని కొనియాడారు. డ్వాక్రా మహిళలను లక్షాధికారులను చేయడమే సీఎం లక్ష్యం అన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. పొదుపు మహిళలు, 4,5,6,7,8 వ వార్డుల కౌన్సిలర్లు ఉరుకుందమ్మ, మండ్ల రత్నమ్మ, సిబ్బంది, ఆర్పీలు యశోదమ్మ, భారతి, పార్వతమ్మ, లింగేశ్వరి, శాంతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు, నాయకులు

కార్మికులకు అండగా వైఎస్సార్‌సీటీయూసీ



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి

పాణ్యం: రాష్ట్రంలో వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు వైఎస్సార్‌టీయూసీ జెండా అండగా ఉంటుందని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషలు అన్నారు. మంగళవారం పాణ్యంలోని వైఎస్సార్ సర్కిల్‌లో వైఎస్సార్‌సీటీయూసీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చొరవతో పాణ్యం గ్రామానికి చెందిన చాంద్‌బాష(వెల్డింగ్ చాంద్) వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక అయ్యారన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి కార్మికుల పక్షాన నిలబడి వారికి మరింత భరోసా కల్పించాలని చాంద్‌బాషకు సూచించారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి గజమాల వేసి నివాళి అర్పించారు. జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, కరుణాకర్‌రెడ్డి, పాణ్యం ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, బాబు, వలి, సుధాకర్, కోఆప్షన్ సభ్యులు జాకీర్, బాబి, ఆలమూరు సర్పంచ్ షేక్ మహ్మద్ షరీఫ్, కృష్ణమూర్తి, కృష్ణారెడ్డి, రవిరెడ్డి, గురు రాజారావు, ఆటోమాబు, ఆటో డ్రైవర్లు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు

ఓర్వకల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు తీసుకొచ్చారని జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని కాల్వబుగ్గ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో రూ.1.61 కోట్లతో నూతనంగా నిర్మించిన వసతి గృహ సముదాయాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ మాలిబాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలో గతంలో చదివిన పూర్వ విద్యార్థులు ఎంతో మంది ఉన్నత స్థానాల్లో స్థిరపడటంతోపాటు ప్రతి ఏటా పాఠశాల పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడం సంతోషకరమన్నారు. చదువు విషయంలో ప్రభుత్వం ఒకటో తరగతి నుంచి మొదలుకొని జీవితంలో స్థిరపడేంత వరకు అవసరమైన సౌకర్యాలు సమకూర్చుతోందన్నారు. కాగా పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న ప్రహరి గోడను నిర్మించాలని ప్రిన్సిపాల్ మాలిబాషా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా అందుకు స్పందించిన ఆయన గోడ నిర్మాణానికి అనుమతులు వచ్చాయని, త్వరలోనే పనులు పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పిల్లవాడు చదువుకోవాలనే ఉద్దేశంతోనే అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని సూచించారు. పాఠశాలలో క్రీడా మైదానాన్ని గ్రీన్ కో వారితో మాట్లాడి చదును చేయిస్తామన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఇదే పాఠశాలలోనే ఇంటర్ విద్యను అభ్యసించడానికి జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని కోరగా అందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ పీఓ వేణుగోపాల్, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ రంగనాథ్‌గౌడు, ఓర్వకల్లు సర్పంచు తోట అనూష, కాల్వ గ్రామ సర్పంచు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నూర్‌అహ్మద్, లోటర్‌బాష, సింగిల్ విండో చైర్మన్లు నాగతిరుపాలు, చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంఈఓ సునంద పాల్గొన్నారు.



నూతన వసతి గృహ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కూలీల సంఖ్యను పెంచాలి

కోడుమూరు రూరల్: గ్రామాల్లో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఎంపీడీఓ, ఏపీఓ రమాదేవి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మార్చి నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున పెండింగ్ మస్టర్లు, బిల్లులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కూలీలకు 100రోజుల పనిదినాలను, 2023–24ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల గుర్తింపు యస్టిమేషన్లను పూర్తి చేయాలని ఆదేశించారు.

మూలపెద్దమ్మ ఆలయం భక్తులతో కిటకిట

గడివేముల: గడివేముల మూలపెద్దమ్మ అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మూలపెద్దమ్మకు కుంకుమార్చన, ఆకుపూజ వంటి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చైర్మన్ తలారి చిన్నన్న, ఈఓ మోహన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

'పది'లో మంచి మార్కులు సాధించాలి

కోడుమూరు రూరల్: పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఎంఈఓ అనంతయ్య సూచించారు. మంగళవారం కోడుమూరులోని బాలికల హైస్కూల్‌ను ఎంఈఓ తనిఖీ చేసి విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తర్వాత పదవ తరగతి విద్యార్థినులతో ముచ్చటించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థిను ఉన్న కాస్త సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా గణితంలో గ్రాఫ్‌కు సంబంధించిన ప్రశ్నలు, సోషల్‌లో మ్యాపు పాయింట్లు, సైన్స్‌లో చిత్రపటములు చక్కగా వేసినచో మంచి మార్కులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజకుమారి ఉన్నారు.

